క్లుప్తంగా

ఎమ్మెల్యే పరామర్శ



సత్యారావును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జోగులు

రాజాం: మండలంలోని కొండపేటకు చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు ముద్దన సత్యారావును ఎమ్మెల్యే కంబాల జోగులు ఆదివారం పరామర్శించారు. ఇటీవల ప్రమాదానికి గురై, సత్యారావు ఎడమచేయి విరిగిపోగా, ఆస్పత్రిలో చికిత్స పొందిన అనంతరం ఇంటి వద్దనే ఉండి, కోలుకుంటున్న ఆయనను ఎమ్మెల్యే కలిసి, ఆరోగ్యం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే వెంట పార్టీ రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

పౌష్టికాహార కిట్ల పంపిణీ



పౌష్టికాహార కిట్లు పంపిణీ చేస్తున్న వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ వెంకటేశ్వరరావు

రేగిడి: మండలంలోని ఉనుకూరులో అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం కింద పౌష్టికాహార కిట్లు ఆదివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ గేదెల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మాతాశిశు మరణాల రేటు తగ్గించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ కిట్లు అందిస్తోందన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న ఈ పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా సీసీ కాలువ నిర్మాణం



కొండచాకరాపల్లిలో జరుగుతున్న సీసీ కాలువ నిర్మాణ పనులు

వంగర: మండలంలోని కొండచాకరాపల్లి గ్రామంలో సీసీ కాలువ నిర్మాణ పనులు చాలా చురుగ్గా జరుగుతోంది. చర్చి నుంచి గ్రామ సచివాలయం వరకు రూ.3.80 లక్షల పంచాయతీ నిధులతో ఈ పనులు చేస్తున్నారు. పనులు నాణ్యతా ప్రమాణాల మేర చేపడుతున్నామని సర్పంచ్ గొయ్యమ్మ తెలిపారు.

నేత్ర వైద్య శిబిరం



వృద్ధుల కళ్లను తనిఖీ చేస్తున్న ఆప్తాలమిక్ అధికారి వసంతరావు

రాజాం సిటీ: స్థానిక మల్లిఖార్జున కాలనీలోని వృద్ధాశ్రమంలో ఆదివారం నేత్ర వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. ఆప్తాలమిక్ అధికారి ఎస్.వసంతరావు అక్కడి వృద్ధుల కళ్లను తనిఖీ చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. వృద్ధాప్యంలో వచ్చే బీపీ(అధిక రక్తపోటు), షుగర్(చక్కెర వ్యాధి)తో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వైద్యుల సలహాలు, సూచనల మేరకు మందులు వాడాలని తెలిపారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం సూర్యుని వెలుతురులో ఉండాలని, అలా అయితే శరీరానికి కావాల్సిన డి-విటమిన్ లభిస్తుందని, ఆరోగ్యంగా ఉంటారన్నారు. నేత్ర శస్త్రచికిత్స అవసరమైన ముగ్గురు వృద్ధులను రాజాం ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. కార్యక్రమంలో ఆశ్రమ పర్యవేక్షకుడు థామస్ తదితరులు పాల్గొన్నారు.

వాహన తనిఖీలు



ఆటోలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

రేగిడి: మండలంలోని మజ్జిరాముడుపేట, బూరాడ, చిన్నశిర్లాం జంక్షన్ వద్ద పోలీసులు ఆదివారం వాహన తనిఖీలు చేపట్టారు. ఎస్.ఐ.శ్రీనివాసరావు వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ వాహనంతో బయటకు వచ్చేటప్పుడు వాహనం ధ్రువపత్రాలు, లైసెన్స్ వెంట తీసుకురావాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం తాగి వాహన నడపవద్దన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దన్నారు.

అభివృద్ధి పథంలో 'పనుకువలస'

- గ్రామంలో రూ.2.22 కోట్లతో అభివృద్ధి పనులు
- మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యం
- ఆనందం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



రూ.44.80 లక్షలతో గ్రామంలో నిర్మించిన రక్షిత మంచినీటి పథకం



రూ.97 లక్షల వ్యయంతో నిర్మించిన పనుకువలస-సోమిదవలస బీటీ రోడ్డు



రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం



రూ.21.80 లక్షలతో రైతు భరోసా కేంద్రం నిర్మాణం



రూ.20.80 లక్షలతో నిర్మించిన హెల్త్ వెల్‌నెస్ సెంటర్ భవనం

తెర్లాం: మండలంలోని పనుకువలస గ్రామం అభివృద్ధి బాటలో పయనిస్తోంది. ప్రభుత్వాలు ఎన్ని మారినా అక్కడి సమస్యలు మాత్రం ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా ఉండేవి. కనీస సౌకర్యాలైన రోడ్లు, తాగునీరు, వైద్యం అందక గ్రామస్తులు నానా ఇబ్బందులు పడేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏర్పాటైన సచివాలయ వ్యవస్థతో గ్రామం ప్రగతి బాటపట్టింది. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతీ గ్రామ సచివాలయం పరిధిలో అభివృద్ధి పనులకు రూ.20 లక్షలు మంజూరు చేయడంతో పాటు గ్రామీణుల వద్దకే ప్రభుత్వ సేవలు అందేలా సచివాలయం, ఆరోగ్య సేవలు అందేలా వెల్‌నెస్ సెంటర్‌లు, రైతులకు సాగు సలహాలు, సూచనల కోసం రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటికోసం పెద్దఎత్తున నిధులు మంజూరు చేసి, పక్కా భవనాలు నిర్మించారు. దాదాపు రూ.2.22 కోట్ల వ్యయంతో గ్రామంలో రక్షిత మంచినీటి పథకం నిర్మించడంతో పాటు, కుళాయిలు ఏర్పాటు చేశారు. అలాగే బీటీ రోడ్డు, ఆర్‌బీకే, హెల్త్ వెల్‌నెస్ సెంటర్, సచివాలయం భవనాలు నిర్మించారు. వీటితో ప్రజలకు పక్కాగా మౌలిక సదుపాయాలు అందుతున్నాయి. అంతేకాకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాల రూపంలో పణుకువలస సచివాలయం పరిధిలోని పణుకువలస, సోమిదవలస, గోపాలవలస, జగన్నాథవలస గ్రామాల్లోని లబ్ధిదారులకు ఏకంగా రూ.13.05 కోట్ల లబ్ధి చేకూరింది. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయి. ఓ వైపు అభివృద్ధి, మరోవైపు సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని గ్రామస్తులు ప్రశంసిస్తున్నారు. మళ్లీ మళ్లీ ఇదే ప్రభుత్వం ఉండాలని, కావాలని కోరుకుంటున్నారు.

ఏళ్లనాటి కష్టాలు మాయమయ్యాయి..



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన ద్వారా మా గ్రామంలో నెలకొన్న ఏళ్లనాటి కష్టాలు మాయమయ్యాయి. ఒకప్పుడు తాగునీరు కోసం తీవ్ర ఇబ్బందులు పడేవాళ్లం. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రక్షిత మంచినీటి పథకం, రోడ్లు నిర్మించడం చాలా ఆనందంగా ఉంది. ఈ నాలుగేళ్లలో జరిగిన అభివృద్ధి కళ్లెదుటే కనిపిస్తోంది. ముఖ్యంగా పనుకువలస-సోమిదవలస జంక్షన్ వరకు చేపట్టిన బీటీ రోడ్డుతో ఆ రోడ్డులో హాయిగా ప్రయాణం చేయగలుగుతున్నాం.

–స్వామినాయుడు, పనుకువలస, తెర్లాం మండలం

సీఎం జగన్ రుణం తీర్చుకోలేనిది..



వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాతనే గ్రామంలో అభివృద్ధి జరిగింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రుణం తీర్చుకోలేనిది. ఆయనను మళ్లీ మళ్లీ ముఖ్యమంత్రిని చేసి, ఆయన రుణం తీర్చుకుంటాం. ఓ వైపు అభివృద్ధి, మరోవైపు ప్రజాసంక్షేమానికి ప్రాధాన్యమిస్తున్న సీఎం జగనన్నే మళ్లీ గెలిపించుకుని, మరోసారి సీఎంను చేస్తాం.

–చందక సత్యనారాయణ, సర్పంచ్, పణుకువలస.

ఘనంగా గణేశుని నిమజ్జనోత్సవం



తప్పెటగుళ్ల కళాకారుల ప్రదర్శన



వీధుల్లో వినాయకుని ఊరేగింపు



ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన కాళికామాత బొమ్మ

రామభద్రపురం: మండల కేంద్రంలోని కనిమెరక వీధిలోని గణేశుని నిమజ్జనోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. 21 రోజుల పాటు పూజలందుకున్న వినాయకుడికి ఉదయం ప్రత్యేక పూజలు చేసి, సాయంత్రం విగ్రహాన్ని వీధుల్లో ఊరేగించారు. అనంతరం దగ్గరలోని నదీతీరానికి తీసుకువెళ్లి, నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో భాగంగా చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రధానంగా తప్పెటగుళ్ల ప్రదర్శన, బిందెల డ్యాన్సు, కోలాటం, యువతీ, యువకుల నృత్యాలు, కోయ డ్యాన్సు, కాళికామాత బొమ్మల ప్రదర్శన ప్రధాన ఆకర్షణగా నిలిచాయి.

కనకమహాలక్ష్మికి పంచామృతాభిషేకం

చీపురుపల్లి: పట్టణంలోని కనకమహాలక్ష్మి ఆలయంలో అర్చకులు ఆదివారం అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వ హించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అదే విధంగా అమ్మ వారి దేవస్థానంలో ఉదయం 11 గంటల నుంచి ఆలయ కమిటీ నేతృత్వంలో అన్నప్రసాద వితరణ చేశారు.

భగవన్నామస్మరణతోనే మోక్షం

రేగిడి: భగవన్నామస్మరణతోనే మోక్షం కలుగుతుందని ఆధ్యాత్మిక వక్తలు జడ్డు జగ్గారావు, రామశేషు అన్నారు. స్థానిక దత్తపీఠంలో ఆధ్యాత్మిక గురువు కిమిడి సత్యంనాయుడు ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక జ్ఞానబోధ సభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భగవంతుని నామాన్ని నిత్యం స్మరణ చేస్తూ ఉంటే పాపాలు పోతాయని, దుఃఖాలు దరిచేరవన్నారు. మనిషిని తరింపజేసేది తారకమంత్రమని, ప్రతిఒక్కరూ భగవంతుని నామాన్ని భక్తిశ్రద్ధలతో స్మరిస్తే ముక్తిని పొందవచ్చన్నారు. కార్యక్రమంలో దత్తపీఠం కన్వీనర్ ఆర్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి

తెర్లాం: ప్రాథమిక స్థాయి నుంచే ప్రతీ విద్యార్థి పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి సూచించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తొలుత విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. అనంతరం పుస్తక పఠనం ద్వారా కలిగే లాభాలను వివరించారు. పుస్తకాలు చదవడం ద్వారా మంచి విజ్ఞానం అలవడుతుందన్నారు. పుస్తక పఠనంతో పాటు కథలు చెప్పడం, రాయడం నేర్చుకోవాలని, అలాగే చిత్రలేఖనంపై కూడా దృష్టి సారించాలని తెలిపారు.

టీడీపీ కార్యక్రమాలు చూసి, జనం నవ్వుకుంటున్నారు..

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

బొబ్బిలి: టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్ట్‌కు నిరసనగా ఆ పార్టీ చేపడుతున్న కార్యక్రమాలు చూసి, జనం నవ్వుకుంటున్నారని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. స్థానిక పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం మీడియాతో మాట్లాడిన ఆయన స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో అరెస్టయి జైలుజీవితం గడుపుతున్న చంద్రబాబును సమర్థించడమంటే అతడు చేసిన అక్రమాలను సమర్థించినట్లేనన్నారు. అలాంటి వ్యక్తికి మద్దతుగా ఆయన అరెస్ట్‌కు వ్యతిరేకంగా ఆ పార్టీ నేతలు ప్లేట్లు కొట్టడం, వాహనాల హారన్లు మోగించడం, విజిల్స్ వేయడం, రాత్రిపూట లైట్లు ఆపి, కొవ్వొత్తులు వెలిగించడం వంటి కార్యక్రమాలు చూసి, రాష్ట్ర ప్రజలు వారికేమైనా పిచ్చి పట్టిందా అని అనుకుంటున్నారన్నారు. మరోవైపు చంద్రబాబు తనయుడు లోకేష్ ఇటీవల మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు చేసిన అక్రమాలను ఇంటింటికీ వెళ్లి తెలియజేస్తాననడమనేది తన తండ్రి చేసిన అవినీతిని అతడు ఒప్పుకున్నట్లేనన్నారు. చంద్రబాబు అరెస్ట్‌తో ఆ పార్టీ నేతలు ఏం చేస్తున్నారో వారికే అర్థంకావడం లేదన్నారు. ఆ పార్టీ మనుగడ కష్టమనిపించే జనసేన పార్టీ మద్దతు కోసం ఎగబాకుతున్నారన్నారు. టీడీపీ ఎన్ని కుయుక్తులు పన్నినా ప్రజలు ఆ పార్టీని ఎప్పటికీ నమ్మరన్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే జనం ఉన్నారని, వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీ మళ్లీ భారీ విజయం సాధించడం ఖాయమన్నారు. మరో రెండు రోజుల్లో పారాది వంతెన మరమ్మతులు పూర్తి చేసి, బస్సులు కూడా నడిపిస్తామన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో బొబ్బిలిలో చాలా అభివృద్ధి పనులు జరిగాయని, అనేక సంక్షేమ పథకాల ద్వారా నియోజకవర్గ ప్రజలకు లబ్ధి చేకూరిందన్నారు. రాష్ట్రంలో ఓడిపోయే మొట్టమొదటి టీడీపీ అభ్యర్థి బొబ్బిలిలోని బేబీ నాయన అని అన్నారు. జనం వద్దకు వెళ్లి, ఏం చెప్పి ఓట్లు అడగాలో చెప్పలేని పరిస్థితిలో ఆయన ఉన్నారన్నారు. ఎప్పుడూ అసత్యాలు మాట్లాడే ఆయనను బొబ్బిలి ప్రజలు నమ్మరన్నారు. ఇటీవల ఆయన బ్రిటిష్ వారు కట్టిన వంతెనను కూడా బేబీ నాయన తన తాత నిర్మించాడు.. తన తండ్రి కట్టాడని చెప్పుకోవడం ఆయన అవివేకానికి నిదర్శనమన్నారు. ఎవరి హయాంలో అభివృద్ధి జరిగిందో ప్రజలకు బాగా తెలుసన్నారు. ప్రజల ఆశీర్వాదం తనకుందని, 2024లోనూ తానే ఎమ్మెల్యేగా గెలుస్తానన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ, మండల అధ్యక్షులు చోడిగంజి రమేష్‌నాయుడు, ఉత్తరావిల్లి అప్పలనాయుడు, శంబంగి వేణుగోపాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటికి తాగునీరు అందించడమే లక్ష్యం

- జెడ్పీటీసీ బండి నర్సింహులు



పెనుబాకలో జల్‌జీవన్ మిషన్ పనులు పరిశీలిస్తున్న జెడ్పీటీసీ నర్సింహులు

రాజాం: ప్రతీ ఇంటికి తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని జెడ్పీటీసీ సభ్యుడు బండి నర్సింహులు అన్నారు. మండలంలోని పెనుబాక గ్రామంలో జరుగుతున్న జల్‌జీవన్ మిషన్ పనులను ఆదివారం పరిశీలించిన ఆయన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఎమ్మెల్యే కంబాల జోగులు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుల చొరవతో జల్‌జీవన్ మిషన్ పనులకు రూ.2 కోట్లు మంజూరైందని, ఈ నిధులతో పనులు చాలా చురుగ్గా జరుగుతున్నాయన్నారు. ఇప్పటివరకు గ్రామంలోని వెయ్యి ఇళ్లకు ఇంటింటి కుళాయి కనెక్షన్ పనులు పూర్తయ్యాయన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ వావిలపల్లి జగన్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేయాలి

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావును కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయుడు

రామభద్రపురం: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు సూచించారు. విజయనగరంలో పార్టీ రామభద్రపురం మండల అధ్యక్షుడు అప్పికొండ లక్ష్మణ్‌నాయుడు జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావును ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు పార్టీ మండల అధ్యక్ష పదవి రావడానికి కృషి చేసిన జెడ్పీ చైర్మన్‌ను శాలువాతో సత్కరించి, కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ మండలంలో పార్టీ మరింత బలోపేతానికి కృషి చేయాలన్నారు. పార్టీ అధిష్టానం అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ప్రతినిధి అప్పికొండ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

పత్ర కషాయంతో తెగుళ్ల నివారణ



బాడంగి: పత్ర కషాయం తయారీని ప్రయోగాత్మకంగా వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

బాడంగి: పత్ర కషాయంతో పంటలకు పట్టే చీడపీడలు, తెగుళ్లను నివారించవచ్చని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తెలిపారు. మండలంలోని కోడూరు గ్రామంలో రైతులకు పత్ర కషాయం తయారీపై ఆదివారం అవగాహన కల్పించారు. వేప, జిల్లేడు, ఉమ్మెత్త, మారేడు, పొగాకు, తూటికాడ, ఆముదం, నల్లేరు, కానుగ, పచ్చిమిర్చి, కలబంద, వెల్లుల్లి ఇలా ప్రతీది రెండు కిలోల చొప్పున తీసుకుని, తయారు చేసిన కషాయాన్ని చీడపీడలు, తెగుళ్లు సోకిన పంటలపై పిచికారీ చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మరిపి శ్రీదేవి, సన్యాసినాయుడు, ఐసీఆర్‌పీ వై.తులసి పాల్గొన్నారు.



రేగిడి: పత్ర ద్రావణం తయారీకి సేకరించిన వివిధ పత్రాలు

రేగిడి: మండలంలోని అంబఖండి గ్రామంలో సామూహిక పత్ర ద్రావణాల తయారీపై రైతులకు ఆదివారం అవగాహన కల్పించారు. ఐసీఆర్‌పీలు కరణం వరలక్ష్మి, పాగిరి లక్షుంయుడు, గుండాల రవి కలిసి తొలుత పత్ర ద్రావణాల తయారీని ప్రయోగాత్మకంగా వివరించారు. వేప, కానుగ, ఉమ్మెత్తు, జిల్లేడు, మారేడు, వెదురు, వావిలాకు, రావి, మందార, కలబంద, తూటికాడ ఆకులు, తులసి, అత్తాకోడల్లాకు, వెంపలాకులు సేకరించి, పత్ర ద్రావణాన్ని తయారు చేసుకుని, పంటలపై పిచికారీ చేసుకోవాలన్నారు. దీంతో చీడపీడలు, తెగుళ్లు పంటకు సోకవన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శాసపు గోవిందనాయుడు, ఎంపీటీసీ పుర్లి సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

రూ.9 కోట్లతో రాజాం-పాలకొండ రోడ్డు పనులు



రోడ్డు లైనింగ్ పనులు చేస్తున్న దృశ్యం

రేగిడి: రాజాం-పాలకొండ ప్రధాన రోడ్డు పనులు చాలా చురుగ్గా జరుగుతున్నాయి. ఈ పనుల కోసం మొత్తం రూ.9 కోట్లను ప్రభుత్వం మంజూరు చేయగా, ప్రస్తుతం రేగిడి మండలంలోని బూరాడ జంక్షన్ నుంచి సంకిలి గ్రామం వరకు రోడ్డు పనులు చేపడుతున్నారు. 60 అడుగుల వెడల్పుతో కొత్తగా వేస్తున్న రోడ్డులో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నామని ఆర్‌అండ్‌బీ జేఈ నాగభూషణరావు తెలిపారు. ప్రస్తుతం రోడ్డు వెడల్పు, లైనింగ్ పనులు జరుగుతున్నాయన్నారు.

తూటికాడ కషాయం తయారీపై అవగాహన



బొబ్బిలి: జగన్నాథపురంలో తూటికాడ కషాయం తయారీపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

బొబ్బిలి: మండలంలోని జగన్నాథపురంలో తూటికాడ కషాయం తయారీపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ కషాయంతో వరి పంటలోని సుడిదోమ పోటును నివారించవచ్చని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఉరిటి శంకరరావు, వ్యవసాయ శాఖ సహాయకురాలు సుస్మిత తెలిపారు.

అన్నదానం

రాజాం: మండలంలోని అంతకాపల్లి గ్రామం వద్ద వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. మొగిలివలసకు చెందిన భక్తుల సహకారంతో ఈ కార్యక్రమం చేపట్టగా, చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు స్వామి అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయం వద్ద ప్రతీ శని, ఆదివారం భక్తులు అన్నదానాలు నిర్వహిస్తున్నారని ఆలయ కమిటీ తెలిపింది.